సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం । 31 । మే । 2025



జూరాల కిటకిట

జూరాల వద్ద కృష్ణానది అందాలను వీక్షించేందుకు సందర్శకులు తరలివచ్చారు.

వివరాలు 8లో ▸



ఛాంపియన్‌గా పాలమూరు

ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే క్రికెట్ లీగ్‌లో పాలమూరు చాంపియన్‌గా నిలిచింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.7 /21.7

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విద్యార్థుల నమోదు శాతం పెంచి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) దుంకుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట ప్రచార జాతాను స్థానిక టీప్రిస్ పాఠశాల వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, యువత అంతా కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే నెల 6 నుంచి ప్రభుత్వపరంగా చేపట్టే 'బడిబాట'ను విజయవంతం చేయాలని కోరారు. కాగా, రెండు జీపుల ద్వారా జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టడంపై ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఎన్.కిష్టయ్య, కె.రవికుమార్, ఎన్.వెంకటేష్, వి.భాస్కర్, హేమంత్ కుమార్, అజయ్, జయంతి, శంకర్‌నాయక్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల బకాయిలు విడుదల చేయాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త జాబ్‌కార్డులను వెంటనే ఇవ్వాలని కోరారు. ఉపాధి పనిని పట్టణ కూలీలకు వర్తింపచేయాలని సూచించారు. పని దినాలను 200 రోజులకు పెంచి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల్లో జాబ్‌కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పని చేసిన వారికి వారంలోపు వేతనాలు చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో మంచినీళ్ల, మెడికల్ కిట్లు, టెంట్ ఏర్పాటు, పనిముట్లు, ఓఆర్ఎస్ పాకెట్లను ఇవ్వాలన్నారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశవ్యాప్తంగా నిధులను పని దినాలను కూలీలకు జాబ్‌కార్డులను పెద్ద ఎత్తున కోత విధించిందని ఆరోపించారు. అనంతరం డీఆర్‌డీఓ నర్సిములుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, హన్మంతు, భగవంతు రాములు, శివలీలా, ఎఫ్‌ఏలు వెంకటయ్య, నర్సిములు, సాయిలు, చంద్రశేఖర్, వెంకటయ్య, మొగులయ్య, కొర్దయ్య, నీలమ్మ, మంజుర చెన్నయ్య, దాసు, జయమ్మ నాగలక్ష్మి పాల్గొన్నారు.

మక్తల్ ఎమ్మెల్యేకు తప్పిన ప్రమాదం



షాద్‌నగర్‌రూరల్: నారాయణపేట జిల్లా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వాహనాన్ని కారు ఢీ కొట్టింది. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకుంది. వివరాలివీ.. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శుక్రవారం తన కారులో హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌వైపు వెళ్తున్నారు. జడ్చర్లవైపు నుంచి షాద్‌నగర్‌వైపు వెళ్తున్న మరో కారు టోల్‌ప్లాజాలోని వేరే లైన్‌కు మారేందుకు డ్రైవర్ పక్కకు తిప్పాడు. ఎమ్మెల్యే వాహనం టోల్‌ప్లాజాను దాటి వెళ్తున్న సమయంలో పక్క నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలూ దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి స్థానిక నేతలు గుమ్మడికాయ కొట్టి దిష్టి తీసి మరో వాహనంలో పంపించారు.

కుర్చీ వదలండి..

క్షేత్రస్థాయిలో పర్యటించి.. ప్రజా సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, విజయేందిర, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

- అధికార యంత్రాంగానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర హితబోధ
- మంత్రి జూపల్లితో కలిసి మహబూబ్‌నగర్, నారాయణపేట అధికారులతో సమీక్ష
- యువ వికాసం, భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కొనుగోళ్లపై ఆరా
- వ్యవసాయ కార్యాచరణ, వైద్యశాఖ, అంటువ్యాధుల నివారణ చర్యలపై ప్రశ్నల వర్షం
- వివిధ రకాల సమస్యలను లేవనెత్తిన ఎమ్మెల్యేలు.. పలు శాఖలపై రాజనర్సింహ ఆగ్రహం
- ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం, నిర్లక్ష్య వైఖరిపై అసహనం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'ప్రజా సమస్యలను గుర్తించడంలో, వాటి పరిష్కారంలో అధికార యంత్రాంగం వెనుకబడి ఉంది. కలెక్టర్లతో సహా అధికారులు ముందుగా కుర్చీ వదలండి. ఉదయం ఆరు నుంచి గ్రామాల్లో గానీ, మున్సిపాలిటీల్లో గానీ పర్యటించండి. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకోండి. వాటి పరిష్కారం దిశగా అడుగులు వేయండి. ఎక్కడా జాప్యం లేకుండా చూడండి.' అని ప్రభుత్వ శాఖల అధికారులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. రాజీవ్ యువ వికాసం, భూభారతి రైతు సదస్సులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలులో పురోగతి, ధాన్యం కొనుగోళ్లు, వానాకాలం వ్యవసాయ కార్యాచరణ, వైద్యశాఖతో పాటు అంటువ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలపై మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల అధికారులతో శుక్రవారం ఆయన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సమీక్షించారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయా జిల్లాల పరిధిలోని ఎమ్మెల్యేలు పాల్గొని.. వివిధ రకాల సమస్యలను లేవనెత్తారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ 'ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యాన్ని, జాప్యాన్ని సహించేది లేదు. ప్రభుత్వ పథకాల అమలులో ఆశించిన ప్రగతి సాధించేలా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి' అని సూచించారు. ఈ క్రమంలో పలు శాఖల అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

ఇందిరమ్మ ఇళ్లపై సుదీర్ఘ సమీక్ష..

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్.. నత్తనడకన నిర్మాణాలపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. నిర్ణీత జాగ కంటే కొంచెం ఎక్కువైనా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఎమ్మెల్యేలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ఎక్కువ విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకుంటే యజమాని బాధ్యతేనని మంత్రి అన్నారు. శాసనసభ్యులు కోరినట్లు గ్రామ సభల్లో ప్రకటించిన అర్హుల జాబితా ప్రకారం ఇళ్లు మంజూరు చేసే అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. జిల్లాలో దేవాదాయ, వక్ఫ్, శిఖం, అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయన్నే వివరాలను కలెక్టర్లు అందుబాటులో ఉంచాలని దామోదర ఆదేశించారు. రాజీవ్ యువ వికాసంపై రెండు రోజుల్లో నిర్వహించనున్న కేబినెట్ మీటింగ్‌లో చర్చించనున్నట్లు వెల్లడించారు.

రెవెన్యూ అధికారులపై సీరియస్..

భూ సమస్యలకు సంబంధించి పలువురు ఎమ్మెల్యేలు తమ దృష్టికి వచ్చిన వివిధ అంశాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ధరణిని నిబంధనలు రూపొందించకుండా అమలు చేశారని.. అప్పీల్‌కు అవకాశం లేదన్నారు. ధరణిలో జరిగిన తప్పులను భూ భారతి ద్వారా సవరిస్తున్నామని చెప్పారు. ఈ భూభారతి చట్టంలో అప్పీల్‌కు అవకాశం ఉందని.. అయినా అధికారులు రైతులను తమ చుట్టూ తిప్పుకోవడం సరి కాదని అన్నట్లు సమాచారం. తహసీల్దార్ వద్దకు వెళ్తే ఆర్డీఓ వద్దకు.. అక్కడికెళ్తే అదనపు కలెక్టర్.. అక్కడ కాదంటూ కలెక్టర్ వద్దకు తిప్పించుకోవడం భావ్యం కాదని అధికారులపై సీరియస్ అయినట్లు తెలిసింది. తమ దగ్గరకు వచ్చిన దరఖాస్తులను ఆయా అధికారులు నిర్దేశిత గడువు లోపు పరిష్కరించాలని సూచించారు.

అంబులెన్స్ డ్రైవర్ నుంచి డాక్టర్ల దాకా దందా..

వైద్యశాఖకు సంబంధించిన సమీక్ష సందర్భంగా నారాయణపేట, మక్తల్ ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి పలు సమస్యలను మంత్రి రాజనర్సింహ దృష్టికి తీసుకొచ్చారు. నారాయణపేట నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి రోగులు వస్తారని.. ఆ రోగులను మహబూబ్‌నగర్ నుంచి అంబులెన్స్ డ్రైవర్లు నిమ్స్ ఆస్పత్రికి తరలించకుండా.. హైదరాబాద్‌లోని వెల్‌నెస్ సెంటర్‌కు తీసుకెళ్తున్నారని వెల్లడించారు. ఆ హాస్పిటల్ వాళ్లు అమాయక రోగుల వద్ద లక్షలాదిగా దోపిడీ చేస్తున్నారంటూ పలు ఉదాహరణలతో వివరించారు. మంత్రి జూపల్లి సైతం గతంలో ఓ హాస్పిటల్‌లో చోటుచేసుకున్న ఘటనను గుర్తు చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ డ్రైవర్లు కమీషన్లకు కక్కుర్తి పడి పేదల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని.. అంబులెన్స్ డ్రైవర్ల నుంచి డాక్టర్ల దాకా దందా జరుగుతున్నట్లు తెలుస్తోందని.. వెంటనే అంబులెన్స్ డ్రైవర్ల వ్యవహారంపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

నెలకోసారి ప్రైవేట్ హాస్పిటళ్లను తనిఖీ చేయాలి..

కలెక్టర్లు, జిల్లా అధికారులు పౌష్టికాహారం, విద్య, ఆరోగ్యం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆస్పత్రులను రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలన్నారు. వీటితో పాటు జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటళ్లను ప్రతి నెలా తనిఖీ చేసి.. ఆయా వైద్యానికి సంబంధించి రోగుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులతో సహా నివేదిక తయారు చేయాలన్నారు. ఇటీవల ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెలివరీలకు సంబంధించి సిజేరియన్లు పెరిగాయని.. అరికట్టి నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మహమ్మదాబాద్‌లో ప్రజలకు బీపీ, షుగర్ సంబంధిత ఎన్‌సీడీ కిట్లు అందడం లేదని ప్రస్తావించారు. అధికారులపై సీరియస్ అయిన మంత్రి..క్రమం తప్పకుండా అంగన్‌వాడీల ద్వారా అందజేయాలని ఆదేశించారు.

సరైన ప్రణాళిక లేదంటూ..

అంటువ్యాధుల నివారణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలపై ఆయా జిల్లాల అధికారులు వివరించిన క్రమంలో ముందస్తుగానే వర్షాకాలం వచ్చిందని మంత్రి అన్నారు. సరైన ప్రణాళిక లేదని.. ఇప్పటికైనా పక్కా కార్యాచరణతో ముందుకుసాగాలని సూచించినట్లు సమాచారం. ముంపు నివారణ, ఫాగింగ్ ఇతరత్రా పనుల్లో వేగం పెంచాలని సూచనలు చేసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఆరోగ్యం, విద్య, రెవెన్యూ విభాగాల పనులు, పురోగతిపై ప్రతి వారం కలెక్టర్లు స్వయంగా సమీక్షించాలని మంత్రి దామోదర ఆదేశించారు. వానాకాలం సీజన్‌కు పంటల సాగు ప్రణాళిక, విత్తనాలు, ఎరువుల లభ్యతపై ఆరా తీసిన క్రమంలో ఓ అధికారి సరిగ్గా వివరాలు వెల్లడించకపోవడంతో ఎందుకీ నిర్లక్ష్యం అంటూ ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, చిత్రంలో ఎస్పీ జానకి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఎస్పీ జానకితో కలిసి సమీక్షించారు. కలెక్టరేట్, పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖ వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటుచేయాలని సూచించారు. పోలీస్ గౌరవ వందనంతో పాటు వేడుకలలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి వసతి, పారిశుధ్య ఏర్పాట్లుచేయాలని, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మోహన్‌రావు, శివేంద్ర ప్రతాప్, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ నవీన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికపై తకరారు!



డివిజన్ల వారీగా అర్హుల జాబితా తయారీలో నిమగ్నమైన మున్సిపల్ సిబ్బంది (ఫైల్)



మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1,400 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

- ఇప్పటికే క్షేత్రస్థాయిలో 2 వేల ఫైళ్లకు దరఖాస్తుల వడపోత
- ఒక్కో డివిజన్‌లో 20 నుంచి 30 మంది వరకు అర్హులయ్యే అవకాశం
- జాబితా తయారీలో తలమునకలైన మున్సిపల్ అధికారులు
- మా పేర్లు పరిశీలించాలని 'ప్రజావాణి'కి కొందరి ఫిర్యాదు
- కార్యాలయానికి వివిధ పార్టీ నాయకుల సిఫారసు లేఖలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం (ఎల్–1) పనులు కొనసాగుతున్నా.. పట్టణ ప్రాంతాల్లో చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. ఈ పథకం ఎప్పుడు ప్రారంభిస్తారోనని ఎదురుచూస్తున్నారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏడాదిన్నర క్రితం 'ప్రజాపాలన' సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 5,135 దరఖాస్తులు అందాయి. వీటి వివరాలను గతంలోనే ఆన్‌లైన్‌లో మున్సిపల్ సిబ్బంది నమోదు చేశారు. అనంతరం కొన్ని నెలలకు విడతల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ వార్డు కమిటీ సభ్యులు సైతం పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారుల అన్ని వివరాల తనిఖీతో పాటు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. చివరకు వడపోతలో 2,300 మందిని అర్హులుగా గుర్తించారు.

■ పాలమూరు నగరానికి ఈ పథకం కింద ఎల్–1లో 1,400 ఇళ్లు మంజూరయ్యాయి. దీంతో సొంత స్థలం కలిగిన వారు 1,380 ఉన్నట్లు తేల్చారు. మహబూబ్‌నగర్‌లో ప్రస్తుతం 51 డివిజన్లు ఉండగా సరాసరి 20 నుంచి 30 మంది వరకు అర్హత సాధించారు. ఈ విషయం తెలుసుకున్న మిగతా వారు తమ పేర్లను సైతం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చేర్చాలని ప్రధాన పార్టీల నాయకులకు విజ్ఞప్తి చేశారు. మరికొందరి పేర్లు సైతం పరిశీలించాలని మున్సిపల్ అధికారులకు సిఫారసు లేఖలు పంపారు. ఇంకొందరు ఏకంగా కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజావాణి'కి ఫిర్యాదు చేశారు. వీటన్నింటినీ ఇప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే అర్హుల జాబితా తయారీ మరింత జాప్యం కానుంది. ఇదిలాఉండగా పట్టణ ప్రాంతాల్లో ఇంకా ఈ పథకం ప్రారంభం కాకపోవడంతో పేదలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు అర్హుల జాబితా ఎప్పుడు ప్రకటిస్తారు? ఇంటి పనులకు శంకుస్థాపన ఎప్పుడు చేస్తారోనని ఎదురుచూపులు చూస్తున్నారు. మరోవైపు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద లబ్ధిదారులను గుర్తించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ సుమారు 4,600 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించింది. ప్రస్తుతం ఈ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఈ దరఖాస్తులన్నీ దాదాపు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వచ్చినవే కావడం గమనార్హం.

క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి



ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి నగర పరిధిలోని మొత్తం 51 డివిజన్లలో క్షేత్రస్థాయి తనిఖీ పూర్తయింది. మరోవైపు పీఎంఏవై కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నాం. ఎల్–1 అర్హుల జాబితాను సైతం సిద్ధం చేస్తున్నాం. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తదుపరి కార్యాచరణ ఉంటుంది.

– డి.మహేశ్వర్‌రెడ్డి, కమిషనర్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్

'ఫ్రై డే.. డ్రై డే' ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలో 'ఫ్రై డే.. డ్రై డే' చేపట్టారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 52 డివిజన్ల పరిధిలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికీ మున్సిపల్ సిబ్బందితో పాటు ఆశా కార్యకర్తలు తిరిగి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ చోట్ల చాలా రోజుల పాటు డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన నీటిని పారబోయించి చుట్టూ ఫినాయిల్ చల్లారు.



శివశక్తినగర్‌లోని ఓ ఇంటి వద్ద బకెట్‌లో నిల్వ నీటిని పారబోస్తున్న మున్సిపల్ సిబ్బంది


బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరం అడ్మిషన్ పొందేందుకు అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి సుదర్శన్ తెలిపారు. 1, 5వ తరగతిలో ప్రవేశం కోసం కులం, ఆదాయం, రెసిడెన్సి, బోనాఫైడ్ ధ్రువపత్రాలతో మీ సేవ కేంద్రాల్లో వచ్చే నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతువేదికలు.. సౌర కేంద్రాలు

భవనాలపై ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నద్ధం

- ఒక్కో కేంద్రం వద్ద 5 కిలోవాట్ల సామర్థ్యం..
- కేంద్రాల నిర్వహణకు విద్యుత్ విక్రయం
- పైలెట్ గ్రామాలైన జానంపేట, కొండారెడ్డిపల్లిలో విజయవంతం
- అన్ని వేదికల్లో ఏర్పాటుకు సిద్ధమవుతున్న టీజీ రెడ్‌కో



జిల్లాల వారీగా రైతువేదికలు

జిల్లా	రైతువేదికలు
మహబూబ్‌నగర్	87
నాగర్‌కర్నూల్	140
జోగుళాంబ గద్వాల	94
నారాయణపేట	77
వనపర్తి	69

కోస్గి: బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన రైతువేదికల నిర్వహణకు నిధులు సమకూరడం లేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదాయ సమీకరణకు రైతువేదిక భవనాలపై సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసి విద్యుదుత్పత్తి చేసి విక్రయించేలా చర్యలు తీసుకుంటోంది. ఒక్కో వేదికపై 5 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర పలకలు అమర్చడంతో విద్యుత్ అవసరాలు పోను ఏడాదికి సుమారు రూ.25 వేల ఆదాయం సమకూరేలా ప్రణాళికలు రూపొందించింది.

పైలెట్ గ్రామాల్లో విజయవంతం..

రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి పాలమూరు జిల్లాను ప్రామాణికంగా తీసుకొని జిల్లాకు రెండు చొప్పున పైలెట్ గ్రామాల రైతువేదికలను ఎంపిక చేసి సౌర విద్యుదుత్పత్తి చేపట్టింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మహబూబ్‌నగర్ జిల్లా జానంపేట, నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలం కొండారెడ్డిపల్లిని ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో విజయవంతం కావడంతో మిగిలిన రైతువేదికపై సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో రెడ్‌కో అధికారులు సిద్ధమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 467 రైతువేదికలపై సోలార్ ప్యానెల్స్ బిగించి సౌర విద్యుత్ తయారీకి చర్యలు తీసుకుంటోంది.

నిర్వహణ భారం..

గత ప్రభుత్వ హయంలో రైతులను సమావేశపర్చి శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ, సలహాలు, సూచనలు అందించడంతో పాటు ఎరువులు, విత్తనాల పంపిణీ కోసం 5 వేల ఎకరాలను ఓ క్లస్టర్‌గా విభజించి ఒక్కో క్లస్టర్‌కు ఒకటి చొప్పున రైతువేదిక నిర్మించారు. వీటి నిర్వహణ బాధ్యతను ఏఈఓలకు అప్పగించారు. భవనాల నిర్మాణం పూర్తయినా.. నిర్వహణకు నిధులు మంజూరుగాకపోవడంతో అధికారులు సైతం మిన్నకుండిపోయారు. సొంతంగా ఆదాయం లేకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతువేదికల లక్ష్యం నీరుగారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతోంది. రైతువేదికలపై సోలార్ పలకల ఏర్పాటుతో ఆదాయం సమకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వం తాజా నిర్ణయంతో రైతువేదికల నిర్వహణకు నిధుల కొరత లేకుండా సక్రమంగా సాగాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు.



గుండుమాల్‌లోని రైతువేదిక

ఆదాయ సమీకరణ ఇలా..

రెడ్‌కో సంస్థ అధికారిక లెక్కల ప్రకారం ఒక్కో రైతువేదికపై 5 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ పలకలు బిగిస్తే నెలకు 600 యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుంది. సొంత అవసరాలకు 100 యూనిట్లు వినియోగించినా.. మిగిలిన 500 యూనిట్లను విక్రయించి ఆదాయం సమకూర్చుకోవచ్చు. యూనిట్ రూ.4కు అమ్మినా నెలకు రూ.2 వేలు, ఏడాదికి రూ.24 వేల ఆదాయం వస్తుంది. అయితే సౌర పలకల ఏర్పాటుకు ప్రభుత్వం ఒక్కో వేదికకు రూ.3 లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కుసుమ్ పథకం కింద సౌర పలకలు ఏర్పాటు చేయనున్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకే..



రైతులకు అందుబాటులో ఉంటూ సాగు సలహాలు, సూచనలు, సమీక్షల కోసం నిర్మించిన రైతువేదికల నిర్వహణకు నిధులు మంజూరుకావడం లేదు. సొంతంగా ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రభుత్వం సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేయడం హర్షణీయం. ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు మరింత మెరుగైన సేవలు అందుతాయి.

– తిరుపతి, ఏఈఓ, గుండుమాల్ క్లస్టర్

అన్ని వేదికలపై ఏర్పాటు..

ఉమ్మడి జిల్లాలో పైలెట్ గ్రామాలైన జానంపేట, కొండారెడ్డిపల్లి రైతులవేదికల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు విజయవంతమైంది. ఉమ్మడి జిల్లాలోని 467 రైతువేదికలపై ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని భవనాలు ఒకే నమూనాలో నిర్మించడంతో సౌర పలకల బిగింపు ఒకేసారి చేపట్టేందుకు వీలుంటుంది. సౌర విద్యుత్ తయారీ, విక్రయం తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.

– మనోహర్‌రెడ్డి, మేనేజర్, టీజీ రెడ్‌కో, ఉమ్మడి పాలమూరు జిల్లా

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి


భాను ప్రకాష్ (ఫైల్)

మాగనూర్: మండలంలోని మందిపల్లిలో విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మందిపల్లి గ్రామానికి చెందిన బలరాం కుమారుడు భాను ప్రకాష్ (14) తన బాబాయి కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో భాను ప్రకాష్ ఇంటికి క్యూరింగ్ చేసి మోటార్ ఆఫ్ చేసే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై మరణించాడు. అయితే ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మాగనూర్ ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

అనుమానంతో భర్త అమానుషం

- భార్య మృత్యువాత
- పోలీసుస్టేషన్‌లో లొంగుబాటు


ఎల్లమ్మ (ఫైల్)

పెద్దకొత్తపల్లి: అనుమానంతో కట్టుకున్న భర్తే కాలయముడై భార్యపై దాడి చేసి చంపిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావ్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గురువారం రాత్రి గంట్రావ్‌పల్లికి చెందిన గొల్ల ఎలుక నాగేషు తన భార్య ఎల్లమ్మ (40) తలపై కర్రతో బలంగా కొట్టడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. బాధితురాలిని బంధువులు చికిత్స కోసం వనపర్తికి తరలిస్తుండగా.. మార్గ మధ్యలోనే మృతిచెందింది. దీంతో నాగేషు పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. మృతురాలి అన్న శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్, ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ఘటనపై వారు గ్రామంలో విచారణ చేపట్టారు. వనపర్తి జిల్లా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎల్లమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

మానవపాడు: మండలానికి చెందిన యశ్వంత్ కుమార్ (21) కరెంట్ షాక్‌కు గురై మరణించాడు. యశ్వంత్ కుమార్ ఇటీవల ఏపీలోని చిత్తూరు జిల్లా పుంగనూర్ మండలంలో సర్వే పనులకు వెళ్లాడు. అక్కడ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. యువకుడు మృతి వార్త తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చోరీ కేసులో మూడేళ్ల జైలుశిక్ష


కురుమూర్తి

ఆత్మకూర్: ఇంట్లో చోరీకి పాల్పడ్డ నిందితుడికి ఆత్మకూరు కోర్టు జడ్జి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించారని డీఎస్పీ వెంకటేశ్వర రావు తెలిపారు. శుక్రవారం ఆత్మకూర్‌లో సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్‌తో కలసి డీఎస్పీ వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరి 23న ఆత్మకూర్‌లోని భార్గవినగర్‌లో నివాసముంటున్న మణివర్ధన్‌రెడ్డి నివాసంలోకి కురుమూర్తి అనే అతను చొరబడి రూ.1500 నగదు, పూజ సామగ్రిని ఎత్తుకెళ్లాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని శుక్రవారం ఆత్మకూర్ కోర్టులో హాజరు పర్చగా వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి శ్రీలత దోషికి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

విద్యుత్ తీగలు తెగి పడి గేదెల మృతి

మరికల్: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగి పడి మూడు పాడి గేదెలు మృతి చెందిన ఘటన మరికల్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. మంతన్‌గోడు భాస్కర్‌రెడ్డికి చెందిన గేదెలు గ్రామ శివారులోని ఇబ్రహీంపట్నం రహదారి పక్కన మేత మేస్తుండగా ఆకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగి వాటిపై పడడంతో గేదెలు మరణించాయి. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని తెగిపడిన తీగలను తొలగించారు. పశు వైద్యాధికారి మహాదేవ్ మృతి చెందిన గేదెలకు పోస్టుమార్టం నిర్వహించి పంచనామా చేశారు. మరణించిన గేదెల విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని, విద్యుత్ శాఖ తరఫున బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చారకొండ: మండలంలోని శేరి అప్పారెడ్డిపల్లిలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన గోలి జోగి రెడ్డి గేదెను మేత కోసం పొలంలో వదిలాడు. గేదె మేత మేసే క్రమంలో పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తు వైరుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మరణించిన గేదె విలువ రూ.30 వేలు ఉంటుందని రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. విషయం తెలుసుకున్న పశు వైద్యాధికారి షేక్ మదార్ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు.

విషాదం మిగిల్చిన విహారయాత్ర

- ఎన్‌హెచ్–44పై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ప్రమాదంలో తల్లీకూతురు దుర్మరణం
- ప్రాణాలతో బయటపడిన తండ్రి, మరో కూతురు
- తిరుగు ప్రయాణంలో చోటు చేసుకున్న ఘటన


ప్రమాదానికి గురైన కారు


ఎర్ర శ్రావణి (ఫైల్)


సాయిచైత్ర (ఫైల్)

ఎర్రవల్లి: విహారయాత్ర ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనక నుండి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం మునగాల సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని నిజాంపేటకు చెందిన ఎర్ర వెంకటబాబ్జి ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఈ నెల 24న తన భార్య ఎర్ర శ్రావణి (38), పెద్ద కుమార్తె లక్ష్మీసహస్ర, చిన్న కుమార్తె సాయిచైత్ర (7)లతో కలిసి తమ కారులో విహారయాత్ర నిమిత్తం ఊటీకి వెళ్లారు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడ సంతోషంగా గడిపారు. గురువారం తెల్లవారుజామున తిరిగి తమ స్వగ్రామానికి కారులో బయలు దేరారు. మార్గమధ్యంలోని మునుగాల శివారులో జాతీయ రహదారిపై ఎలాంటి సూచికలు లేకుండా నిలిపిన లారీని వీరు ప్రయాణిస్తున్న కారు వెనక నుంచి వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసం కాగా.. వెంకటబాబ్జి భార్య ఎర్ర శ్రావణికి తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందింది. తీవ్రంగా గాయపడిన చిన్న కుమార్తె సాయిచైత్రను కర్నూలు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. ప్రమాదం నుంచి గాయాలతో బయటపడిన వెంకటబాబ్జి, లక్ష్మీసహస్రలను చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. వెంకటబాబ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి


అంజప్ప మృతదేహం

మక్తల్: ఇసుక టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన గొల్లపల్లిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మక్తల్ మండలం మంతెన్ గోడ్ గ్రామానికి చెందిన గోసాయి అంజప్ప (45) ఇతర గ్రామాలకు వెళ్లి మెకానిక్ పని చేసుకుంటూ జీవించేవాడు. గురువారం కూడా పని నిమిత్తం బైక్‌పై మక్తల్ గ్రామానికి వెళ్తుండగా మక్తల్ నుంచి మహబూబ్‌నగర్‌కు ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజప్ప అక్కడికక్కడే మరణించాడు. అంజప్పకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆచారి తెలిపారు.

కారు డ్రైవర్ నిర్లక్ష్యం: యువకుడి మృతి


బాలరాజు (ఫైల్)

కొత్తకోట: అతి వేగంగా దూసుకొచ్చిన కారు బైకును ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి 11 గంటల సమయంలో కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. వనపర్తి నుంచి కొత్తకోట వైపుగా వస్తున్న కారు కొత్తకోటలోని బీపీఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న బాలరాజు (25) అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై ఎస్‌ఐ ఆనంద్, మృతుడి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తకోట మండలంలోని రాఘవేంద్ర కాలనీలో నివసిస్తున్న దాసరి సుక్కమ్మ, శివన్నకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త అనారోగ్యంతో ఇంట్లో ఉంటుండడంతో కొడుకు బాలరాజు చేపలు అమ్మి జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో మండలంలోని కానాయపల్లి చెరువులో చేపలు పట్టేందుకు బాలరాజు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడని తల్లి తెలిపారు. ఈ క్రమంలో స్థానిక బీపీఆర్ ఫంక్షన్‌హాల్ వద్దకు రాగానే కారు డ్రైవర్ అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో బాలరాజు తలకు రక్తపు గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని తల్లి సుక్కమ్మ తెలిపారని ఎస్‌ఐ వివరించారు. ఘటన మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

ఇంట్రా డిస్ట్రిక్ట్ చాంపియన్‌గా మహబూబ్‌నగర్


విన్నర్ మహబూబ్‌నగర్ జట్టుతో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తదితరులు

- లీగ్‌లో నాలుగు విజయాలతో అగ్రస్థానం
- చివరి మ్యాచ్‌లో నారాయణపేటపై ఇన్నింగ్స్ గెలుపు

మహబూబ్‌నగర్ క్రీడలు: అండర్–23 ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. లీగ్‌లో మొదటి నుంచి మెరుగైన ప్రదర్శన కనబరిచిన మహబూబ్‌నగర్ జట్టు వర్షం వల్ల ఒక మ్యాచ్ రద్దు కాగా మిగిలిన 4 మ్యాచుల్లో విజయాలు సాధించి 22 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు బౌలర్ ఎండీ ముఖితుద్దీన్ అత్యధికంగా 35 వికెట్లు తీశాడు.

– జిల్లా కేంద్రానికి సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ ఇన్నింగ్స్ 52 పరుగుల తేడాతో నారాయణపేటపై గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ 49.5 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో అక్షయ్ 103 బంతుల్లో 3 సిక్సలు, 4 ఫోర్లతో 63 పరుగులు చేశాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేపట్టిన నారాయణపేట జట్టు 24.2 ఓవర్లలో కేవలం 72 పరుగులకు ఆలౌట్ అయింది. మహబూబ్‌నగర్ బౌలర్లు ముఖితుద్దీన్ 18 పరుగులు ఇచ్చి 4, షాదాబ్ అహ్మద్ 11 పరుగులకు 3, శశాంక్ 14 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశారు. అనంతరం ఫాలోఆన్ ఆడిన నారాయణపేట రెండో ఇన్నింగ్స్‌లో 17.5 ఓవర్లలో 84 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్‌లో ముఖితుద్దీన్ అ 6.5 ఓవర్లలో 48 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

రానున్న హెచ్‌సీఏ టోర్నీల్లో ప్రతిభచాటాలి

రానున్న హెచ్‌సీఏ టోర్నీల్లో క్రీడాకారులు ప్రతిభచాటాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. అండర్–23 ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్ చాంపియన్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులను ప్రోత్సహించడానికి మొదటిసారిగా ఆరు జట్లతో అండర్–23 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ లీగ్‌లో రాణించిన క్రీడాకారులను 24 మందితో రెండు జట్లుగా విభజించి మూడు మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభచాటే 15 మంది తుది జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లాకు చెందిన డీఎంహెచ్‌ఓ జయచంద్ర మోహన్, డీపీఓ భిక్షపతి, కోచ్ రమణ, శ్రీనివాస్‌గౌడ్, ఉమేష్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు ముఖ్తార్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

వీధికుక్క దాడిలో 10 మందికి గాయాలు


కుక్క దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు


కుక్క దాడితో మైసమ్మ అనే మహిళ కాలికి అయిన గాయం

ఒకరి పరిస్థితి విషమం.. జిల్లా ఆస్పత్రికి తరలింపు

జడ్చర్ల టౌన్: పట్టణంలో శుక్రవారం ఓ వీధికుక్క స్వైరవిహారం చేస్తూ కనిపించిన వారినల్లా గాయపర్చింది. కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఇందిరానగర్ కాలనీలోని వడ్డెర గేరిలో ఓ కుక్క అకస్మాత్తుగా మనుషులపై దాడి చేయడం ప్రారంభించింది. కనిపించిన వారందరిపైకి దూకడంతో ఆ ప్రాంత వాసులు హడలెత్తిపోయారు. వడ్డెర గేరిలోనే 5మందిపై దాడిచేసి గాయపర్చింది. అనంతరం అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైపు పరుగెత్తింది. మార్గమధ్యంలో పూలు అమ్ముకునే ఓ మహిళను తీవ్రంగా గాయపర్చింది. అదే విధంగా రోడ్డుపై వెదురుబొంగులు విక్రయించుకునే లక్ష్మీదేవమ్మ అనే మహిళపై దాడిచేసింది. ఆమె రెండు చేతులపై తీవ్రంగా దాడి చేయడంతో మాంసం ముద్దలు రోడ్డుపై పడ్డాయి. స్థానికులు కుక్కను బెదిరించటంతో అక్కడి నుంచి పరుగు తీసింది. ఈ క్రమంలోనే వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఓ బాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. కుక్కదాడిలో ముగ్గురు చిన్నారులు, ఏడుగురు పెద్దలు గాయపడ్డారు. కుక్క దాడులకు పాల్పడిన ప్రాంతాల్లో అహాకారాలు మిన్నంటాయి. ఏం జరుగుతుందో తెలియక స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కుక్కదాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవమ్మను జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించగా.. ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. కుక్క దాడిలో గాయపడిన వారిలో వెంకటేశ్, రామ్, బిందు, మైసమ్మ తదితరులు ఉన్నారు. మున్సిపాలిటీలో స్వైరవిహారం చేస్తున్న కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

అయిజ: కుక్కల దాడిలో మేకలు, గొర్రెలు మృతిచెందిన ఘటన మండలంలోని చిన్న తాండ్రపాడులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చిన్న తాండ్రపాడు రైతువేదిక భవనం సమీపంలో తెలుగు రాముడు తన మేకలు, గొర్రెల మందను నిలిపి ఇంటికి వెళ్లాడు. ఇదే సమయంలో గ్రామంలోని వీధి కుక్కలు మందలోకి చేరి 16 గొర్రెలు, 17 మేకలపై దాడిచేసి చంపివేశాయి. బాధిత రైతును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నలుగురు వేటగాళ్లు అరెస్ట్


ఉడుములతో పట్టుబడిన వేటగాళ్లు

లింగాల: నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో నలుగురు వేటగాళ్లను అదుపులోకి తీసుకున్నట్లు అటవీ శాఖ రేంజర్ ఈశ్వర్ తెలిపారు. పద్మన్నపల్లికి చెందిన కాట్రాజు రాజు, కాట్రాజు నిరంజన్, రాయ బాలయ్య, బల్మూరి లింగస్వామి రమేష్ ఉడుములను పట్టుకొని వెళ్తుండగా గుండాల ప్రాంతంలో అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే స్వాధీనం చేసుకున్న ఉడుములలో మూడు చనిపోయి ఉండగా మరో 6 బతికి ఉండడంతో వాటిని బేస్ క్యాంపు దగ్గర ఉంచినట్లు వెల్లడించారు. వన్య ప్రాణుల రక్షణ చట్టం ప్రకారం వన్య ప్రాణులను వేటాడటం నేరమని, అదుపులోకి తీసుకున్న నిందితులను త్వరలో కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వోతో పాటు డీఆర్వో జయదేవ్, ఎఫ్‌బీఓ శివాజీ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హన్వాడ: మండలంలోని వేపూర్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటేశ్ వివరాల మేరకు.. వేపూర్‌కు చెందిన గణేశ్, అనిల్ ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి తమ ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సందర్శకులతో జూరాల కిటకిట


జూరాల ప్రాజెక్టును సందర్శించిన పర్యాటకులు

ధరూరు: నైరుతి రుతు పవనాల రాకతో జిల్లాలో వర్షాలు విస్తృతంగా కురుస్తుండడంతో జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ సీజన్‌లో ప్రాజెక్టుకు మొదటి సారిగా వరద నీరు రావడం.. అదే రోజు గేట్లను ఎత్తడంతో కృష్ణమ్మ అందాలను వీక్షించేందుకు జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. దీంతో శుక్రవారం ప్రాజెక్టు పరిసరాలు సందర్శకులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా చిన్నారులు, యువత సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉదయం నుంచి ప్రాజెక్టు వద్ద గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రమాదభరిత ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లకుండా కంచె వేశారు.

కృష్ణానదిలో పెరుగుతున్న నీటిమట్టం

కొల్లాపూర్: ఎగువ నుంచి వరద జలాలు రావడంతో కృష్ణానదిలో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. జూరాల నుంచి శ్రీశైలం బేసిన్‌కు 80 వేల క్యూసెక్కుల మేరకు నీటిని విడుదల చేయడంతో బ్యాక్ వాటర్ లెవెల్స్ శుక్రవారం నాలుగు అడుగుల మేరకు పెరిగింది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 821 అడుగులకు చేరినట్లు అధికారులు తెలిపారు. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే త్వరలోనే సంగమేశ్వరుడి ఆలయం మళ్లీ నీటిలో మునిగిపోనుంది. ఈ ఏడాది మార్చి 21 నుంచే సంగమేశ్వర ఆలయంలో పూజలు ప్రారంభయ్యాయి. కేవలం రెండు నెలల వ్యవధిలోనే గుడి వద్దకు నీళ్లు చేరుకోవడం ఇదే తొలిసారని పూజారులు, స్థానికులు చెబుతున్నారు.

సంగమేశ్వర గుడి సమీపంలో కృష్ణానది నీటిమట్టం


చేయండి.. చేస్తాం!


మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సమీక్షకు హాజరైన ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు

2 జిల్లాల అధికారులతో సమీక్ష సాగిన తీరు ఇది..

- మంత్రుల ప్రశ్నలకు నీళ్లు నమిలిన పలు శాఖల అధికారులు?
- సూచనలతో సరిపెట్టిన అమాత్యులు
- పలు ప్రభుత్వ శాఖల అధికారుల తీరుపై విమర్శలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఇందిరమ్మ పథకంలో అప్పట్లో ఇళ్ల స్థలాలు మనమే ఇచ్చాం.. ఇప్పుడు కూడా మనమే ఇస్తున్నాం.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకంలో ఇళ్ల గ్రౌండింగ్, నిర్మాణాల్లో ఎందుకు జాప్యం జరుగుతోంది ? ముందస్తుగా వర్షాకాలం వచ్చింది. ఇప్పటికే హెచ్చరించినా సరైన ప్రణాళిక లేకపోవడం ఏమిటి ? భూభారతి చట్టం వచ్చినా.. అప్పీలేట్ అధికారం ఇచ్చినా.. రైతులను తహసీల్దార్, ఆర్డీఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్ చుట్టూ తిప్పించుకోవడం కరెక్టేనా? అంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రశ్నల వర్షం కురిపించడంతో అధికారులు కంగుతిన్నట్లు తెలుస్తోంది. శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వేదికగా మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల అధికారులతో సమీక్షలో.. మంత్రులు, ఎమ్మెల్యేల ప్రశ్నలకు వివిధ శాఖలకు చెందిన అధికారులు సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలినట్లు సమాచారం. ఈ క్రమంలో 'ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందేలా చేయడం అధికారుల బాధ్యత' అంటూ మంత్రులు పలు సూచనలు చేసినట్లు తెలిసింది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టండి.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించండి.. వానాకాలం సాగులో ఇబ్బందులు తలెత్తకుండా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూసుకోండి అంటూ మంత్రులు సూచనలు చేయడం.. ఒకే సార్ అనే సమాధానాలకే పలువురు అధికారులు పరిమితం కావడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సమీక్షకు పలువురు విభాగాధిపతులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కాకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్లు ఆయా శాఖల ఉద్యోగ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. సమీక్ష సమావేశంలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, పరిగి ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు విజయేందిర బోయి, సిక్తా పట్నాయక్, మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

ఎవరెవరు ఏం మాట్లాడారంటే..

- గతంలో ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చైర్మన్‌గా ప్రభుత్వ భూముల పంపిణీకి ఒక అసైన్డ్ కమిటీ ఉండేదని, మళ్లీ ఆ కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రులను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు.
- యాసంగిలో ఎంత మంది రైతుల వద్ద ఎంత ధాన్యం కొనుగోలు చేశారు.. ఎంత మందికి బోనస్ వచ్చింది.. పంట నష్టం ఎంత జరిగింది.. వచ్చిన నష్ట పరిహారం వివరాలను నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలకు అందజేసేలా చూడాలని మంత్రులను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఇవ్వాలని వారు అధికారులను ఆదేశించారు.
- కోయిల్‌కొండ సీహెచ్‌సీ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉందని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.
- బేస్‌మెంట్ వేసుకున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వర్తింప చేయాలని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి కోరారు.
- గతేడాది మహబూబ్‌నగర్ జిల్లాలో డెంగీ కేసులు అధికంగా నమోదు కాగా.. ఈ సారి ముందస్తుగానే వార్డుల వారీగా దోమల నివారణకు ఫాగింగ్ చేయించనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి మంత్రులకు తెలిపారు. మహబూబ్‌నగర్‌తోపాటు నారాయణపేట జిల్లాలోనూ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ ఫాగింగ్ యంత్రాలు లేవని కలెక్టర్లు వారి దృష్టికి తీసుకొచ్చారు. జూన్ మొదటి లేదా రెండో వారంలో వైద్య, ఆరోగ్యశాఖపై నారాయణపేట, మహబూబ్‌నగర్‌లలో ప్రత్యేక సమీక్ష చేయనున్నట్లు దామోదర తెలిపారు. కలెక్టర్లు ప్రభుత్వానికి పంపించే రిపోర్ట్‌లను ఆయా జిల్లాల శాసన సభ్యులకు కూడా పంపించాలని మంత్రి సూచించారు.

రీజినల్ కేన్సర్, ఆర్గాన్ రిట్రీవల్ సెంటర్లను ఏర్పాటు చేస్తాం..

మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఎంఆర్‌ఐ త్వరలో ఏర్పాటు చేయిస్తాం. సిటీ స్కాన్ కూడా ఏర్పాటు చేస్తాం. జాతీయ రహదారిపై ప్రతి 35 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ట్రామా సెంటర్, మహబూబ్‌నగర్‌లో రీజినల్ కేన్సర్ సెంటర్, ఆర్గాన్ రిట్రీవల్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం.

– దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

నకిలీ విత్తన అమ్మకందారులపై ఉక్కుపాదం మోపాలి..

టాస్క్‌ఫోర్స్ బృందాలతో విస్తృత తనిఖీలు చేపట్టి.. నకిలీ విత్తనాలు అమ్మేవారు, రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. మన ప్రభుత్వం వచ్చాకే వరికి బోనస్ ఇస్తున్నాం. ఆ క్రెడిట్ మన ప్రభుత్వానికే దక్కాలి. సీఎమ్మార్ బకాయిలను రికవరీ చేసేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలి. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఆయా భూముల వివరాలపై సమాచారం అందించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. టోల్ ఫ్రీ నంబర్, వాట్సప్ నెంబర్లు ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలి.

– జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి